


# భక్తి మార్గంలో ఆశ్రిత పక్షపాతం

## భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



భగవంతుణ్ణి 'ఆశ్రిత పక్షపాతా' అని కీర్తిస్తాం. రాజకీయనాయకుడు 'ఆశ్రిత పక్షపాతి' ఐతే నిందిస్తాం. మరి భగవంతుడే రాజకీయవేత్త అయితే ఆశ్రిత పక్షపాతం ఏమనిపించుకుంటుంది?

ఇది మహాభారతం చదివిన వారిని వేధించే ప్రశ్న.

శ్రీకృష్ణుడు బాల్యంలో అల్లరి చేసాడు. దొంగతనాలు చేసాడు. వయసు రాగానే స్త్రీలోలుడయ్యాడు. గోపికలకు వస్త్రాపహరణం కూడా చేసాడు. ఇవన్నీ లౌకిక దృష్టికి తప్పుగా తోచినా ఆయన ప్రతి చర్య వెనుకా ఓ మహత్తర సందేశమున్న మాట నిజం. అందువల్లనే ఆయన భగవంతుడయ్యాడు. శ్రీకృష్ణలీలలను వర్ణిస్తూ, వ్యాఖ్యానిస్తూ - ఎందరో కవులు, పండితులు మహాకావ్యాలు రాసారు. భక్తులు శ్రీకృష్ణుణ్ణి పురుషోత్తముడన్నారు. తార్కికులు కూడా ఆయన అసాధారణ పురుషుడని అంగీకరించారు.

వ్యాస విరచిత సంస్కృత కావ్యం 'జయం'లో (తెలుగులో మహాభారతం) - శ్రీకృష్ణుడి పాత్ర విలక్షణమైనది. నమ్మినవారాయన్ను దేవుడని కొలిచారు. నమ్మని కొందరాయన్ను ద్వేషించి భంగపడ్డారు. శ్రీకృష్ణుడు మాత్రం తన దైవత్వానికీ, మహిమలకూ ప్రాధాన్యమివ్వక - రాజకీయ వేత్తగా రాణించాడు. ఆయన రాజకీయ చాతుర్యంలోనూ - అపోహలకూ, అపార్థాలకూ తావిచ్చే విశేషాలు చాలానే ఉన్నాయి. వాటిలో పాండవ పక్షపాతం ముఖ్యమైనది.

భక్తులు దేవుణ్ణి 'ఆశ్రిత పక్షపాతా' అంటూ కీర్తిస్తారు. ఆ దేవుడే రాజకీయవాది అయితే ఆయన నడిపే రాజకీయాల్లో ఆశ్రితపక్షపాతం సహజమే. అసలు మన రాజకీయాల్లో ఆశ్రిత పక్షపాతానికి శ్రీకృష్ణుడే ఒరవడి పెట్టాడనేవారున్నారు. మరి - ఆశ్రిత పక్షపాతం మెచ్చుకోతగ్గ ప్రక్రియ అనిపించుకుంటుందా?

ఈ నేపథ్యంలో మహాభారతంలో శ్రీ కృష్ణుడి పాండవ పక్షపాతాన్ని చర్చిద్దాం.

కౌరవ సామ్రాజ్యానికి వారసుడైన దృతరాష్ట్రుడికి - గుడ్డివాడైన కారణంగా రాజ్యార్హత లేదన్నారు పెద్దలు. అలా ఆయన తమ్ముడు పాండురాజు రాజయ్యాడు.

పాండు రాజు కుమారులు పాండవులు అయిదుగురు. అంతా అసమాన శూరులే కానీ తమ్ముళ్ళంతా పెద్దన్న ధర్మరాజు చాటున ఉండటానికే ఇష్టపడతారు. ధ్రుతరాష్ట్రుని బిడ్డలు కౌరవులు నూర్గురు. తమ్ముళ్ళంతా పెద్దన్న దుర్యోధనుడి నీడలో ఉంటారు.

పాండవులు శ్రీకృష్ణుడి భక్తులు. దుర్యోధనుడు శ్రీకృష్ణుడి అన్న బలరాముడికి ప్రియశిష్యుడు. బలపరాక్రమాల్లో పాండవులు, కౌరవులు - నువ్వా నేనా అన్నట్లుంటారు. చిన్నప్పట్నించీ దుర్యోధనుడికి రాజ్యకాంక్ష ఎక్కువ. ఆ కాంక్షలో తన ఆకాంక్ష ప్రతిబింబాన్ని చూసే దృతరాష్ట్రుడు - కన్నబిడ్డను మందలించలేదు. రెచ్చిపోయిన దుర్యోధనుడు పాండవుల పట్ల అనేక అకృత్యాలు చేసాడు. స్వీయ సామర్థ్యంతోనూ, శ్రీకృష్ణుడి సాయంతోనూ పాండవులు వాటికి తట్టుకున్నారు. చివరకు రాజ్యం కోసం కౌరవ పాండవులకు యుద్ధం

తప్పని సరి అయింది. యుద్ధాన్ని నివారించడానికి రాయబారానికి వెళ్ళిన శ్రీకృష్ణుడు దుర్యోధనుణ్ణి మరింత రెచ్చగొట్టి యుద్ధాన్ని అనివార్యం చేసాడు. యుద్ధంలో పాండవ పక్షాన చేరి కౌరవ నాశనానికి వ్యూహరచన చేసాడు.

ఇంతవరకూ జరిగిన విశేషాల్లో - తార్కికులమనుకునే కొందరికి శ్రీకృష్ణుడి దైవత్వంపై సందేహాలు పుట్టించే అవకాశాలు చాలా ఉన్నాయి.

పాండవులు మంచివాళ్ళు. మంచివాళ్ళైన పాండవులను ద్వేషించే దుర్యోధనుడు కూడా ఇతరత్రా చెడ్డవాడు కాదు.

పాండవులు మాయా జూదంలో ఓడిపోయి అరణ్యవాసం చేస్తున్నప్పుడు - తమను నమ్ముకున్న ప్రజలు దుర్యోధనుడి పాలనలో ఎలాంటి బాధలు పడుతున్నారోనని ధర్మరాజుకి చింత పట్టుకుంది. ఆయన కొందరు చారుల ద్వారా పరిస్థితిని విచారిస్తే - ఓ వింత కబురు తెలిసింది. ప్రజలు పాండవులను మరచిపోవాలనే ఉద్దేశ్యంతో దుర్యోధనుడు ప్రజానుకూలమైన సంస్కరణలు చేపట్టి ప్రజారంజకంగా రాజ్యమేలడమే ఆ వింత.

అంటే దుర్యోధనుడు పాండవ ద్వేషి కావచ్చు కానీ ప్రజాకంటకుడు కాదు. అలాంటప్పుడు పాండవులు రాజ్యాన్ని త్యాగం చేసి కురుసార్వభౌమత్వాన్ని దుర్యోధనుడికే వదిలి ఉంటే కురుక్షేత్ర సంగ్రామం తప్పేది. అంతులేని జన, ధన, మాన నష్టముండేది కాదు. సామాన్య ప్రజలకు ప్రజారంజకమైన పాలన కావాలి కానీ - ఏలిక ధర్మజుడైతేనేం, దుర్యోధనుడైతేనేం? సామాన్యుల కోసం ఈ మాత్రం ఆలోచించకుండా - కేవలం పాండవ పక్షపాతంతో మానవ మారణహోమాన్ని సమర్ధించిన శ్రీకృష్ణుణ్ణి దేవుడనగలమా? పాండవ విజయం ఆయన రాజకీయ చాతుర్యాన్ని నిరూపిస్తుందే తప్ప ఆయన్ను దేవుణ్ణి చేయగలదా?

తర్కంలో మరింత లోతుకు వెడితే సమాధానాలు సందేహాల్లోనే దాగున్న విషయం స్పష్టమౌతుంది.

దుర్యోధనుడు పాండవులను అకారణంగా ద్వేషించాడు. అకారణ ద్వేషం మంచి ప్రభువు లక్షణం కాదు. అటుపైన దుర్యోధనుడు పాండవులను బాధించడానికీ, అవమానించడానికీ దర్మోల్లంఘన చేసాడు. దర్మోల్లంఘన కూడా మంచి ప్రభువు లక్షణం కాదు.

ఇక దుర్యోధనుడు పాండవులకంటే జనరంజకంగా ప్రజాపాలన చేసాడంటే - అందుకు కారణం ప్రజాభిమానం కాదు. అరణ్యవాసం చేస్తూ కూడా ప్రజాక్షేమం గురించి ఆలోచించే పాండవులను - ప్రజలు మర్చిపోయేలా చెయ్యాలన్నదే అతడి తాపత్రయం. ఒక మంచి ప్రభువుగా కాక. పాండవ ద్వేషిగా అతడు ప్రజల మేలు గురించి ఆలోచించాడు. పాండవులు లేని పక్షంలో అతడు ప్రజల గురించి ఆలోచిస్తాడనుకునేందుకు లేదు.

ఇవన్నీ అలాగుంచితే - చివరి క్షణం వరకూ తమ అవమానాలన్నీ సహించిన పాండవులు - ప్రజాక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని - యుద్ధాన్నాపే ప్రయత్నాలు చేసారు. కేవలం పాండవద్వేషంతో - తనకు గెలుపు అనుమానమనీ, తన ముఖ్య సైన్యాధిపతులందరూ పాండవ పక్షపాతులనీ గ్రహించి కూడా - ప్రజాక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా - యుద్ధానికి సిద్ధపడ్డాడు దుర్యోధనుడు.

భూభారాన్ని తగ్గించే ప్రణాళికలో యుద్ధమెలాగూ అనివార్యం. ఆ యుద్ధంలో పాండవ పక్షాన్ని సమర్ధించిన శ్రీకృష్ణుడి రాజకీయ చాతుర్యంలో దైవత్వముందనడంలో సందేహం లేదు.

ఆశ్రిత పక్షపాతం భగవంతుడి కీర్తిని పెంచుతుంది. ఆశ్రితులనెన్నుకోవడంలో చూపే విజ్ఞత ఆయన్ను దేవుణ్ణి చేస్తుంది. మనం కావాలనుకున్నంత మాత్రాన భగవంతుడికి ఆశ్రితులం కాలేము. ఆ అదృష్టం కలగడానికి భక్తి మార్గాన్ని ఆశ్రయించడం మన కర్తవ్యం. దేవుణ్ణి నమ్మమనుకునేవారూ, నమ్ముతునామనుకునేవారూ, నమ్మేవారూ కూడా గుర్తించాల్సిన విషయమిది.

వచ్చే నెల కురుక్షేత్ర సంగ్రామంలో అన్యాయాలుగా తోచే విశేషాలను భక్తి మార్గంలోకి మళ్ళించే ప్రయత్నం చేద్దాం.